# శుభలేఖ

నాకింకా పెళ్ళి కాలేదు పెళ్ళి కాని వాళ్ళు పెళ్ళిళ్ళకు వెళ్ళి కాబోయే జంటలను చిరకాలం సంసార సుఖంలో వర్ధిల్లండి అని ఆశీర్వదించవలసి రావటం కంటే ట్రాజెడీ ఇంకోటి లేదని నా అభిప్రాయం. అంచేతనే పెళ్ళిళ్ళకు వెళ్ళటమంటేమహాబోరింగ్‌గా ఉంటోంది నాకు అయితే ముఖ్యమైన వాటికి మాత్రం వెళ్ళటం తప్పటం లేదు

ఆమధ్యాహ్నం నేను పాలసీదార్ల అడ్రస్సుల ఫైల్సుతో సతమతమవుతూండగా లోకల్ డెలివరీలో వచ్చిన ఒక కవర్ను మీకు శుభలేఖ అంటూ తెచ్చి ఇచ్చాడు అటెండరు `తరవాత చూడొచ్చు'అనుకుంటూ మడిచి, ఆ పూటే అందుకున్న జీతం పన్నెండొందలూ ఉన్న జేబులో కాక, రెండో జేబులో పెట్టుకున్నాను టాంక్ బండ్ మీద కొచ్చాక గాని శుభలేఖ విషయం జ్ఞాపకం రాలేదు.

తీరా బండి ఆపి శుభలేఖ తీసి చూద్దును గదా, అది పైకి ఎంత అందంగా ఉందో లోపల అంత శూన్యంగా ఉంది. లోపల మాటర్ లేదు! ఎవరో మాటర్ ప్రింటవ్వని కాగితాన్ని చూసుకోకుండా నాకు పంపించారు! నాసంగతి తెలిసిన వాళ్ళెవ్వరైనా వారు నాకు ముఖ్యులయితేనే తప్ప నాకు శుభలేఖ పంపరు కాబట్టి ఇదేదో ముఖ్యమైన పెళ్లే అయి ఉంటుందనే అనిపించింది అయితే ఇది ఎవరి పెళ్ళని అనుకోను? ఏ పెళ్ళికని అటెండ్ కాను?

వైర్‌లెస్ వార్తలు వెళ్ళినంత వేగంగా నా మనస్సులోకి కాదంబరి వచ్చేసింది. 'రైట్, ఇది కాదంబరి పెళ్ళి శుభలేఖే అయ్యుంటుంది.' అనుకున్నాను. మేమిద్దరం ఉద్యోగాల వేటలో ఉన్నప్పుడు కాదంబరి, నేను మొదటిసారిగా క్రాస్ రోడ్స్ బస్ స్టాప్‌లో కలుసుకున్నాము కలుసుకోవటమేంటి, చూసుకోవటమేంటీ, ప్రేమించుకోవటమేంటి.. అన్నీ ఏకకాలంలో జరిగిపోయాయి అది మొదలు మేము ఇటీవలి వరకూ కంటిన్యుయస్‌గా ప్రేమించుకున్నాం. అయితే ఇటీవల పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్న సమయానికి ఒక జ్యోతిష్కుడు అడ్డు తగిలాడు మా ఇద్దరికీ పెళ్ళయితే ఏవేవో గండాల్లో పడతామన్నాడు. కాదంబరి అదిరిపోయింది ఆమెకు జ్యోతిష్యంలో ఉన్న నమ్మకం వల్ల మేము ఇంక పెళ్ళి ప్రసక్తి మానేయవలసి వచ్చింది ఎప్పటికైనా విడివిడిగా అయినా పెళ్ళిళ్ళు చేసుకోవలసిన వాళ్ళమే కనుక, అందుకు అడ్డుకాకుండా ఉండే మేరకు మాత్రం మా ప్రేమించుకోవటాన్ని లిమిట్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాము.

దాంతో మా తాలూకు ' అన్ లిమిటెడ్ లవ్' అనేది 'లిమిటెడ్ లవ్' గా మారి మేము అపురూపంగా అప్పుడప్పుడు ప్రేమించుకోవటం మొదలు పెట్టాము కూడా.

అయితే, ఇటీవలే అంటే వారం క్రితం నేను విన్నదేమంటే, కాదంబరి బాంక్ స్ట్రీట్‌లోని మా బ్రాంచి ఆఫీసులో పని చేస్తున్న గుమాస్తా నొకణ్ణి పెళ్ళి చేసుకోబోతూందని ఈ విషయం ఇప్పుడు జ్ఞాపకం రాగానే ఇది తప్పకుండా కాదంబరి పెళ్ళి శుభలేఖేనసే విషయం నా మనస్సులో స్థిరపడింది. నా వస్తువు నాచెయ్యి జారి పోతున్నందుకు దిగులు పుట్టింది కూడా.

టైం చూసుకున్నాను అయిదుంబావు

అయిదున్నర కల్లా రాంనగర్‌లో కాదంబరి ఇంట్లో ఉన్నాను

కాదంబరి తన వాకిట్లో పూలమొక్కల మధ్య తిరుగుతూ తల దువ్వుకుంటోంది తలంటి పోసుకున్నట్టుంది, పిల్లగాలికి కురులు గాల్లో ఎగురుతూంటే అసలే అందమైన ఆమె ముఖం నాకు ఎన్నో

పెట్లు అందంగా కనిపించింది. నన్ను చూడగానే "హాయ్ వెంకూ! ఎన్నాళ్ళక్కనిపించావ్ ? రారా! " అంది

ఇద్దరం లోపలి హాల్లోకొచ్చి కూర్చున్నాం. ఇల్లంతా మామూలుగానే నీట్‌గా ఉంది గానీ ఎక్కడా పెళ్ళి జరగబోయే సూచనలు లేవు! నాకు అనుమానం వేసింది!

నెమ్మదిగా అన్నాను " ఏమిటీ విశేషం?"

కాదంబరి, " విశేషమా ఏముంది! నువ్వు రావడమే విశేషం. పదిరోజులయిందిగా మనం కలుసుకుని !" అంటూ ఒళ్ళు విరుచుకుని బుంగమూతి పెట్టి, " నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. అన్నట్టు.. నా ఒంటి రంగెలా ఉంది? ఫెయిర్ అండ్ లవ్లీ వాడుతున్నాను" అంది

" వాడుతున్నావా? వాడు. కొంతమందయినా పోషకుల్లేకపోతే ఏ కాస్మెటిక్ కంపెనీ అయినా ఎట్లా బతుకుతుంది.? అదిసరేగానీ. ."

" సరేలేదు, గిరేలేదు మరిచేపోయాను" కాదంబరి చటుక్కున లేచొచ్చి నా కుర్చీ వెనకాల నుంచి నా మీదికి వంగి నా మొహంలోకి చూస్తూ చెవులో చెబుతున్నటు అంది. " ఏ డ్రింకు తీసుకుందాం? మత్తు డ్రింకా, మామూలు డ్రింకా?"

నేను ఒక్క క్షణం ఆమె ముఖంలోకి తేరిపార చూసి " నీ పేర్లోనే కావలసినంత మత్తుంది. కాదంబరి అంటేనే డ్రింకని అర్థం. ఇంకా వేరే డ్రింకు కావాలా? మామూల్దే ఏదో పట్రా" అన్నాను.

కాదంబరి నావైపు కోపంగా చూస్తూ చిరచిరలాడుతూ లోపలి కెళ్ళింది. నాకు అంతకంతకూ అనుమానం బలపడుతోంది. పెళ్ళి కాదంబరిది కాదేమో!

అయిదు నిముషాల్లో డ్రింకు గ్లాసుల్తో వచ్చింది కాదంబరి.

నేనన్నాను " నువ్వు ఆఫీసుకు వెళ్ళినట్టు లేదు. సెలవు చిత్తగించావా?"

కళ్ళు చిత్ర విచిత్రంగా తిప్పింది కాదంబరి. వెటకారంగా అంది. " అవును నువ్వొస్తావని యక్షిణి చెప్తే సెలవు పెట్టాను... సరే! లేచి స్నానం చెయ్యి. అన్నట్టు అన్నంలోకి ఏం కూర చెయ్యమంటావు? రాత్రికి మనకి ఇక్కడే పండగ. మా అమ్మ వూళ్ళో లేదులే." అంది.

చెప్పొద్దూ , మామూలప్పటి విషయం వేరు. ఇప్పటి విషయం వేరు. ఇప్పుడు నేను ' ఆమూడ్' లో లేను. ఇప్పడే విషయం ఏమిటో తేల్చుకుని తొందరగా బయటపడాలి. అందుకనే ఇంక సాగదీయకుండా అడిగేశాను. డ్రింకు తాగుతూనే " ఇప్పుడవ్వేంకుదరవ్. ఇంతకీ... నీ పెళ్ళని విన్నాను. ఎప్పుడు?"

కాదంబరి పగలబడి నవ్వింది. " నాకా- పెళ్ళా! నీక్కాకుండానే!... అసలు మనిద్దరికీ పెళ్ళిళ్ళెందుకు చెప్పు! ఇప్పుడేం తక్కువయిందని! హాయిగా ఎంజాయ్ చేస్తూ ఇట్లా ఉండిపోలేమా?"

నాకు అర్థమయింది శుభలేఖ కాదంబరిది కాదు!

కాదంబరి అంది " చీర మార్చాను చూశావా? లాస్ట్ టైము ఆబిడ్స్ ఆప్కోలో నువ్వు కొన్న చీర ఇది. " ఆమె దగ్గరే రెండొందలు అప్పుచేసి నే నామెకు చీర కొనిపెట్టిన విషయం చటుక్కున జ్ఞాపకం వచ్చింది నాకు. సర్రున జేబులోంచి పర్సు తీసి రెండు కాగితాలు టీపాయ్ మీద పెట్టాను

చటుక్కున లేస్తూ అన్నాను " నీ అప్పు తీసేసుకో. అర్జంటుగా ఎయిర్‌పోర్టుకెళ్ళాలి. మళ్ళీ వస్తాను.బై బై"

కాదంబరి పిలుస్తున్నా వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేశాను

క్రాస్‌రోడ్స్ సెంటర్ దాటుతుండగా ఇంకో ఆలోచన వచ్చింది. బహుశా ఈ శుభలేఖ మా ఆఫీసరు కూతురిదేమో, అరెరే! ఆఫీసులో మా కొలీగ్స్‌ను అడిగుండాల్సింది! ఆయనప్పుడే వారం నుంచీ సెలవులో ఉన్నాడు. మహా సెన్సిటివ్ పిండం. అటెండ్ కాకపోతే అడ్డంగా అడిగేసి అదరగొట్టేసే అలవాటున్న ఆసామీ కూడా! అనుకుంటూ తిన్నగా విజయనగర్ కాలనీ వెళ్ళాను. ఆయనింటివైపు దొంగచూపు చూసుకుంటూ బండిని స్లోగా పోనిస్తున్నాను.

అయితేనేం? నాకర్మ కాలింది. మా ఆఫీసరు వాకిట్లోనే నుంచోనున్నాడు. మసక చీకట్లో కూడా నన్ను గుర్తు పట్టేశాడు.

" హలో మిస్టర్ వెంకట్! ఎంత దూరమేమిటి? ప్లీజ్ కమిన్! వుయ్ షల్ హావే గేమ్." వెళ్లక తప్పదు. కనక బండి దిగాను లోపలి కెళ్ళాను. ఆయన అరనిముషంలో చెస్ బోర్డు టీపాయ్ మీద ఎరేంజ్ చేసేశాడు. అది మాగ్నెటిక్ చెస్‌బోర్డు. దాన్ని చూస్తే ఒక్క ఆటయినా ఆడందే వదలబుద్ధి కాదు నాకు ఎప్పుడూను. ఆయన నా వీక్‌నెస్ గమనించాడు కాబట్టే ప్రతి ఆదివారమూ నన్ను ఆటకు పిలుస్తూంటాడు.

అయన తాలూకు పరివారంలో ఇద్దర్ని నిలువునా చంపాక గానీ అసలు విషయం నాకు జ్ఞాపకం రాలేదు. చుట్టూ చూశాను కొంపకు ఎక్కడా పెళ్ళి కళలేదు!

ఇంతలో పెళ్ళికూతురు కావల్సిన ఆయన కూతురు రెండు పెద్దపెద్ద జున్ను ముక్కలు ప్లేట్లల్లో పెట్టుకొచ్చి " ఇవ్వాళ నాపుట్టినరోజు అంకుల్" అంటూ నేను ఆలోచించుకొనే లోపలే నాకాళ్ళకు నమస్కారం పెట్టేసి నాచేతిలో అక్షింతలుంచేసింది. అప్రయత్నంగా నా రెండో చెయ్యి జేబులోంచి పర్సును బయటికి తీసింది.నేను గ్రహించే లోపల ఒక యాభైనోటు ఆ అమ్మాయి చేతిలో కెళ్ళిపోయింది. ఆ అమ్మాయి తలమీద అక్షింతలుంచుతూండగా అప్రయత్నంగా నా నోట్లోంచి వచ్చాయి. " హాపీ బర్త్‌డే టూయూ! పెళ్ళి చేసుకుని ఇటు పుట్టినింటికీ, అటు మెట్టినింటికీ మొత్తం సమాజానికీ ఉపయోగ పడే విధంగా....." అన్న మాటలు.

నా మాటలు ఇంకా పూర్తి కాలేదు. ఆఫీసరుడు అసురుడై పోయాడు. చుక్‌మని అందుకున్నాడు. " పెళ్ళి పెళ్ళి పెళ్ళి! మీ యంగ్ జనరేషన్‌కు నోరు విప్పితే పెళ్ళిమాట తప్పితేఇంకో వర్డ్ రాదేంటయ్యా? అయినా మా అమ్మాయికి వయస్సెంతని? ఓన్లీ ట్వెంటీ ఇయర్స్. ఇంకా పి.జి. డిగ్రీ పుచ్చుకోవాలి. ఏ స్టేట్స్‌కో వెళ్ళాలి. అప్పుడు సెలెక్ట్ చేసుకోవాలి హస్బెండ్‌ను. ఆమాట కొస్తే నీ విషయమేమిటి? దో తర్టీ. నువ్వు మారేజు చేసుకోగలిగావూ? సో, లైఫ్ అంటే మారేజ్ కాదయ్యా, పైకి పోవటం పైకి.పైకి పైపైకి, ఇంకా పైకి...."

నాకు మతి పోయింది. ఆయన ఫిలాసఫీకి, నాకూ, ఆ అమ్మాయికీ పోలికేమిటి? నాకు బాధ్యతల్లేవు కనుక కేర్ ఫ్రీగా ఉండగలుగుతున్నాను అందరూ నాలాంటి వాళ్ళే అవుతారా? నాలాగే ఉండ గలుగుతారా? వూరుకుంటే ఆయన వాళ్ళమ్మాయితో బాటు నన్ను కూడా 'పైకి' పంపించేస్తాడేమోనని భయం వేసి మధ్యలోనే అందుకున్నాను " అఫ్‌కోర్స్! మీదీ ఒక పాయింటేననుకోండి.అయితే మరి... మొన్న ఆఫీసులో లిఫ్టు దగ్గర మాట్లాడుతూ మీ అమ్మాయికి సంబంధం చూస్తున్నట్టు చెప్పారు కదా!"

" ఓ అదా! అది మా పెద్దమ్మాయి సంగతి షి ఇజ్ నౌ థర్టీటూ.మారేజియబుల్ ఏజ్ కదా. అదీ విషయం. సరేగానీ నీ నాలెడ్జీలో ఎవరన్నా మన వాడుంటే చూడ్డూ "

అదీ విషయం! నాముద్దుల శుభలేఖ ఈయన ముద్దుల కూతురిది కాదు పెళ్ళి ఈయనింట్లోది కానే కాదు!

ఇంక నాకక్కడ ఒక్కక్షణం కూడా ఉండబుద్ధికాలేదు అయితే చటుక్కున లేచొచ్చేస్తే అఫెండ్ అవుతాడేమోనని, ఆయన ఆట కట్టించటానికి అవకాశం నాకు అనంతంగా అందినప్పటికినీ నేను రాంగ్ మూవ్స్ వేసి కావాలనే ఘోరంగా ఓడిపోయాను ఆయన పకపకా నవ్వుతూండగా " వస్తానా్సర్" అని చెప్పి ఒక్క దూకులో వీధిలోకి వచ్చిపడ్డాను

ఇంకా పడలేదు నాకొలీగ్స్ చిదంబరం,చిన్మయానందం ప్రత్యక్షం!

చిదంబరం నాతో అన్నాడు " ఏమిట్రోయ్ ఈ నాక్టర్నల్ పెరాంబులేషన్స్(రాత్రి తిరుగుళ్ళు?)" చిన్మయానందం అలవోక నవ్వుతో అందుకొన్నాడు "ఆ! ఏవో లూబ్రికేషన్సయ్యుంటాయి లేరా "

"ఒట్టి లూబ్రికేషన్సే నంటావా, ఫాబ్రికేటెడ్ లూబ్రికేషన్స్ కూడానా? "

" ఏమో, వైబ్రేటింగ్ ఫాబ్రికేటెడ్ లూబ్రికేషన్సయినా అయ్యుండొచ్చు"

నా కొళ్ళు మండిపోయింది. వాళ్ళ వైపు నా కోపాన్ని చూపుల తూపుల్తో ప్రసారం చేశాను మరుక్షణంలో వాళ్ళకు కనుమరుగైపోయాను

ఇంత ఆతృతగా ఇవాళ్టికివ్వాళే ఈ విషయం తేల్చేయాలని నేననుకోవటంలో కారణం లేక పోలేదు మా ఆఫీసుకు ఫ్రాంకింగ్ మెషిన్ ( ఇంకుతో ఉత్తరాల మీద స్టాంపులు గుద్దే యంత్రం) కొనటం విషయమై మాట్లాడడానికి నాలుగురోజుల్లో నేను మా పర్చేజు ఆఫీసర్ తో కలిసి మెద్రాస్ వెళ్ళాలి నాటూరు ఫిక్సప్ అయిపోయింది. తిరిగొచ్చేసరికి ఈ వివాహం కాస్తా అయిపోతే, వూళ్ళో జరిగిన వివాహానిక్కూడా వెళ్ళలేదనే నిష్టూరం భరించాల్సి వస్తుందేమోనని నాబాధ!

నా వేలు విడిచిన మేనమామ కొడుకొకడు సీతాఫల్ మండీలో ఉంటున్నాడు వాడు పాపం చిన్నప్పట్నుంచీ కష్టాలు పడి చదువుకున్నవాడు వాడికి ఉద్యోగం నా హామీ మీదనే వచ్చింది. వాడి చెల్లెలికి ఈ నెల్లోనే పెళ్ళి చెయ్యబోతున్నట్టూ, నేను వెళ్ళకపోతే చచ్చినంత ఒట్టు అనీ ఈ మధ్య ఎప్పుడో కోటీలో కనబడి వాడు నాకు చెప్పాడు. ఇంకేం? నా సూపర్ సానిక్ నాంపల్లి మీదుగా సీతాఫల్‌మండి బయల్దేరింది ఎక్కడి విజయనగర్ కాలనీ, ఎక్కడి సీతాఫల్‌మండీ! తప్పదు కదా మరి!

బుర్రనిండా, ఆలోచన్లూ చికాకూ పేరుకుపోయున్నయేమో, బషీర్‌బాగ్ దగ్గర కొచ్చేసరికి అక్కడి రెడ్ ట్రాఫిక్ సిగ్నల్ నా కళ్ళకు ఆనలేదు అక్కడ ట్రాఫిక్కూ లేదు. కానీ 'మామ' మాత్రం ఉన్నాడు నేను లిబర్టీ రూట్ లోకి తిరిగానో లేదో వెనకాల్నుంచి విజిలు వినిపించటం ఆ వెంటనే మామ ప్రత్యక్షమవటం జరిగిపోయాయి. నేను బండి ఆపక తప్పలేదు నాలో కంగారు మొదలైంది 'మామ' తన డైరీ తీసి అన్నాడు. " నేమ్ ప్లీజ్. నెంబర్ ప్లీజ్ అడ్రస్ ప్లీజ్ లైసెన్స్‌ప్లీజ్. . అటెండ్ ది కోర్టు టుమారో ప్లీజ్.. "

నాకు పిచ్చెత్తినట్లయింది ' నాశ్రాద్ధం ప్లీజ్' అనబోయి తమాయించుకున్నాను. కాస్త తెలివి తెచ్చుకుని అన్నాను. " ప్లీజ్ నేను పడిపోయి ఐమీన్ ఇబ్బందిలో పడిపోయి, కంగార్లో ఉండిపోయి . ఐమీన్ అదే . ఇట్లా దొరికిపోయా ఐమీన్, ఎప్పుడూ ఈ డర్టీ పని చెయ్యలేదు సో, ప్లీజ్ ఈ మాటుకు వదలెయ్యండి "

హంతకుడి వంక చూసినంత కటువుగా నావంక చూశాడు 'మామ'

అన్నాడు ' నాన్సెన్స్! ప్రతివాడికీ ఇదొక మామూలయిపోయింది నో!నో! యూ అటెండ్ దికోర్ట్ టుమారో "

చటుక్కున నేను అతని చేతులు పట్టుకున్నాను " సారీ సర్! మా మిసెస్ హాస్పిటల్ డెలివరీ టైమ్ కవలలు పుట్టొచ్చు మేజర్ మేజర్ ఆపరేషన్ ప్లీజ్ ఫర్ దిస్ టైమ్" అంటూ నా జేబుల్నొంచి రెండు

పదినోట్లు తీసి అతని చేతిలో కుక్కి అతను ఏమంటున్నాడో వినిపించుకోకుండా బండి స్టార్ట్ చేసి స్పీడ్‌లో బయల్దేరాను.

హోటల్లోకి ఎలా వచ్చి పడ్డానో నాకే తెలియదు. ఒక అర అర్డరిచ్చాను. అది కడుపులోకి దిగాక గాని నాకు గాబరా తగ్గలేదు. నా మనస్సులో ఆలోచన్లు ఆకాశంలో ఉల్కలాగా దూసుకు పోసాగాయి.

లోకంలో ఎక్కడైనా పెళ్లికొడుకుల వేటుంది, పెళ్లికూతుళ్ళ వేట ఉంది. కాని పెళ్ళిళ్ళ వేట లేదే ఇదెక్కడి దౌర్భాగ్యం! ఇవేదో వచ్చి వచ్చి నన్నే పట్టుకోవటమేమిటి! అసలయినా ఇలాంటి శుభలేఖల్నందుకున్న వాళ్లంతా నాలాగే మథనపడి గల్లీ గల్లీకి తిరుగుతున్నారా? అన్నట్లు. పెళ్ళిళ్ళు జరిగే ఇళ్ళ వాళ్ళు ముందుగా పోలీసు పర్మిషన్ తీసుకోవాలి గదా! అంచేత కంట్రోల్ రూమ్ కెళ్ళి వాళ్ళను బతిమాలి, సిటీలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లను ఎంక్వయిరీచేయిస్తే ఎక్కడెక్కడ పెళ్ళిళ్ళు జరగబోతున్నాయో తెలిసిపోతుంది గదా! అప్పుడు ఆ ఇళ్ళల్లో నాకు అయిన ఇళ్ళేదో చూసుకుని అక్కడికే వెడితే సరిపోతుంది గదా!

నా అయిడియాకు నాకే నవ్వొచ్చింది. బేరర్ చూడకుండా కర్చీఫ్ నోటికడ్డం పెట్టుకున్నాను మరుక్షణంలో నా మీద నాకే చెడ్డ విసుగొచ్చింది. 'దిస్ ఈజ్ ది లాస్ట్ అటెంప్ట్' అనుకున్నాను. 'నా వేలు విడిచిన మేనమామ కొడుకు చెల్లి పెళ్ళి అయితే ఇప్పుడయినట్లు, లేకపోతే ఇహెప్పుడూ కానట్లు' అని ఒట్టు పెట్టుకున్నాను. మూడో నిముషంలో నేను రోడ్డు మీద ఫోర్త్ గేర్‌లో పడిపోతున్నాను.

నన్ను చూడగానే నామేనమామ కొడుకు మొహం ఆనందంతో పూరీలాగా ఉబ్బిపోయింది. తాళ్లూడిపోతున్న పాత మోడాను ఒహదాన్ని భద్రంగా తీసుకొచ్చి వేసి "కూర్చోబావా" అన్నాడు.

కప్పు వూడిపడబోతున్నట్లున్న ఆ రెండుగదుల పాత కొంపనీ నేను క్షణంలో కళ్ళతో సర్వేచేసేశాను ఏదో మార్పు కనిపిస్తోంది గ్రహించేశాడు మాబావ పిండం! అన్నాడు "మార్పేమిటా అనా చూస్తున్నావు? చెల్లాయి పెళ్ళని నీకు చెప్పాను కదూ పూర్వం, ఆ సంబంధమే... ఏదో వోపిక ఉన్నంతలో అలంకరించాను" ఒక్క క్షణం నా వూపిరి ఆగిపోయింది. అమ్మయ్య నేనిప్పటికి సక్సెస్ అయ్యాను.

అతనన్నాడు" పెళ్ళి ఎల్లుండి రాత్రే. నేనూ అమ్మా రేపొచ్చి నిన్ను పిలుద్దామనుకుంటున్నాం నువ్వే వచ్చావు సంతోషం ఇక్కడే నిన్ను ఆహ్వానిస్తున్నందుకు ఏమీ అనుకోవు గదా!"

నా సంతోషమంతా నా మొహంలోనూ, మాటల్లోనూ పైకి తన్నుకొచ్చేసింది. "ఆహాహా! అదేవిటోయ్ అసలు నువ్వు పెళ్ళి తలపెట్టావో లేదో, తలపెడితే ముహూర్తం ఎప్పుడూ వగైరాలు తెలుసుకుందామనే గదా నేను వచ్చింది. నువ్వసలు పిలవక పోయినా నేను రావలసిన వాణ్ణే. సరే ఎల్లుండి ఆఫీసయ్యాక తిన్నగా వచ్చేస్తాన్లే."

అతను నీళ్ళు నములుతూ అన్నాడు "బావా! ఒక్క అయిదొందలుంటే సర్దవూ రెండు మూడు నెలల్లో ఇచ్చేస్తాను."

నాకు చిన్న చురక తగిల్నట్టనిపించినా, నేను జయించానన్న ఆనందం నన్ను కమ్మేసి కుమ్మేయగా ఎక్కువసేపు ఆలోచించలేదు. "దానికేముందిలే తీసుకో మళ్లీ ఏమిస్తావు గనక! ఇదే నా చదివింపనుకో ఇండ" అని జేబులోంచి అయిదు నోట్లూ తీసిచ్చేశాను.

బయల్దేరి వస్తూంటే నామనస్సు లాటరీ కొట్టేసినంత ఆనందంతో నిండిపోయింది. లేకపోతే, ప్రింటు పడని శుభలేఖ పట్టుకుని తిన్నగా పెళ్ళింటికి వెళ్లగల మొగాడెవడున్నాడు? ఇవాళ్టికి నేను, నేనంటే నేను - ఉన్నాను.

మూడోనాడు ముహూర్తం అయ్యాక సడెన్‌గా జ్ఞాపకం వచ్చి పెళ్ళి పందిట్లో మా బావనడిగాను

"ఏమయ్యా ! ప్రింటు పడని శుభలేఖ పంపిస్తే ఎలా తెలుస్తుందనుకున్నావు? నేనుగా వచ్చాను కాబట్టి సరిపోయింది" అని. అతను తెల్లబోయాడు!" నేనసలు శుభలేఖలే అచ్చు వేయించలేదే! ఎవరిదో అది!" అంటూ పక్కకు వెళ్ళిపోయాడు

నేను నిశ్చేష్టుడినయ్యాను.అంటే జీతంలో డబ్బు ఆరొందలు ఈ పూటకి పూట హరించుకుపోగా, ఈ శుభలేఖ తాలూకు అసలు చదివింపు శ్రమా వగైరాలు నేనింకా ఫేస్ చెయ్యవలసి ఉందన్న మాట.హటాత్తుగా నా నవనాడులూ కుంగిపోయాయి. ఎంత వేగంగా విజయశిఖరం ఎక్కానో అంత వేగంగానూ అఖాతంలోకి పడిపోయాను నామనస్సు క్షోభతో నిండిపోయింది.

బయటికి వచ్చాను.

వూళ్లో ఒక పది రోజుల పాటు ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు తక్షణం బండెక్కటం మంచిదనిపించింది. టూర్ ప్రోగ్రాంను మర్నాటికే రీఫిక్స్ చెయ్యమని రిక్వెస్ట్ చెయ్యటం కోసం ఎక్కడో వూరికి అవతల మూల సనత్‌నగర్‌లో ఉన్న మా ఆఫీసర్ ఇంటివైపు నా బండిని పరుగెత్తించాను.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక., 20-9-79.)

★★★ ★★★ ★★★

# వొద్దన్నానా?

"అమ్మా, పులుసులో పోపు మాడినట్టుగా ఉందే!" "మాడటమా! నేను పెట్టిన పోపు ఎంతనిరా! రెండు శనగ బద్దలే గదా వేశాను!"

"అయితే ఆ బద్దలే మాడాయి."... "చూడ్రా,అసలు వాటి రంగే మారందే!".. "అదీ కథ - పచ్చి గింజల వాసనన్నమాట!"

"ఏడిశావ్ ! మరి ఈ మినపగింజలు ఎట్లా ఎర్రబడ్డాయంటావు?" "సరే! బెల్లం వేశావు అవునా?"... "గోలీకాయంతే గదరా నేవేసింది!"

"చింతపండు కొత్తదా, పాతదా?".. "కొత్తది అప్పుడే ఎక్కడొచ్చింది? పాతదే!".. "అదుగో అదీ గోల! పురుగుల పండు వేసుంటావు- రుచి మారిపోయి చచ్చింది!"... "రెండోరకం సరుకు మనింట్లో వాడగా నువ్వెప్పుడైనా చూశావా అసలు?"

"మంచినీళ్లలో డి.డి.టి. కలిసిందా?" "ఇవ్వాళసలు పంపులు రానే రాందే! బావినీళ్ళు వాడాను వంటకి".

"పెదవేగి కరివేపాగ్గాని వేశావా?" "నువ్వూ, మీ బావా వాళ్ళ దొడ్లో క్రికెట్టాడారుగా, నాయనా.